క్లుప్తంగా

19న వార్డు ఎన్నికలు

చెన్నేకొత్తపల్లి: మండలంలో రెండు గ్రామ పంచాయతీల వార్డు ఎన్నికలు ఈనెల 19న ఉంటాయని ఎంపీడీఓ గంగావతి సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ న్యామద్దల ఆరో వార్డు బీసీ జనరల్, గంగినేపల్లి తండా ఒకటో వార్డు ఎస్టీ జనరల్‌గా రిజర్వేషన్లు ఖరారయ్యాయన్నారు. అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 10 తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయొచ్చన్నారు.

రెండు వార్డులకు ఎన్నికలు

అమడగూరు: మండలంలోని చినగానిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డు, అమడగూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 11వ వార్డుకు ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపీడీఓ మునెప్ప పేర్కొన్నారు. షెడ్యూల్ మేరకు 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నామినేషన్లకు ఆహ్వానం

తలుపుల: మండలంలోని ఉదమలకుర్తి పంచాయతీలోని 4 వ వార్డు (సోమాలవాండ్లపల్లి)కు ఈ నెల 8 వ తేదీ నుంచి 10 వ తేదీ లోగా ఆసక్తి గల వారు నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌ఓ శకుంతల ఓ ప్రకటనలో తెలిపారు. స్థానికులై, పంచాయతీకి ఎలాంటి బకాయిలు లేనివారు అర్హులన్నారు. 11న నామినేషన్ పరిశీలన, 12న ఉపసంహరణ, 19న ఎన్నికలు ఉంటాయని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న కృష్ణమూర్తి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కాలనీకి చెందిన కృష్ణమూర్తి (38) అనారోగ్యంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గతంలో డ్రైవర్‌గా పనిచేస్తుండగా రోడ్డు ప్రమాదంలో కన్ను పోగొట్టుకున్నాడు. దీంతో కూలి పనిచేస్తూ జీవించేవాడు. కిడ్నీలు పాడవ్వడంతో తీవ్ర అనారోగ్యానికి గురైన కృష్ణమూర్తి మనస్తాపానికి గురై తన ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆల్బెండజోల్ వేయించండి


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: ఈ నెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఏవీ రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ 19 వరకూ వయస్సు ఉన్న పిల్లల్లో నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను వేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో 10, 17వ తేదీల్లో పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు మాబుసాహెబ్, డాక్టర్ నాగదుర్గ, ఎంఈఓ ఖాదర్‌వలి, హౌసింగ్ ఏఈ గౌస్‌మొహిదీన్, టెక్నికల్ అధికారి ప్రభాకర్, సీహెచ్‌ఓ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కేఏన్ పాళెంలో మసీదు నిర్మాణానికి సోమవారం రూ. 1,30,000 విరాళాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ లింగాల శివశంకర్‌రెడ్డి మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగాల మధుసూదన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రాఘవతో పాటు పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

మారెమ్మ ఆలయానికి రూ 15 వేలు..

మండల పరిధిలోని కారెడ్డిపల్లి తండాలో ఉన్న మారెమ్మ గుడికి రూ.15 వేల విరాళాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసులు రెడ్డి అందజేశారు.

బాధితుడికి ఆపన్నహస్తం



బత్తలపల్లి: మండలంలోని ముద్దనపల్లి గ్రామానికి చెందిన దేవేంద్ర ఇటీవల బ్రెయిన్‌కు ఆపరేషన్ చేయించుకున్నాడు. ఖర్చులు అధికమయ్యాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భార్య కేతిరెడ్డి సుప్రియకు విన్నవించుకున్నాడు. దీంతో స్పందించిన ఆమె సోమవారం ధర్మవరంలోని స్వగృహంలో ఆయనకు రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే చేనేతల అభ్యున్నతి


నినాదాలు చేస్తున్న నాయకులు

ధర్మవరం: చేనేతల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్‌లు తెలిపారు. పట్టణంలో చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వచ్చి కదిరి గేటు వద్దనున్న చేనేత విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేనేతల సమస్యలను గుర్తించి ముడిపట్టుకు రాయితీ రూ.600ను ప్రభుత్వం నుంచి ఇప్పించారన్నారు. వాటిని గత ప్రభుత్వం చేనేతలకు సరిగ్గా ఇవ్వలేదన్నారు. మరోసారి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి చేనేతల సమస్యలను తీసుకెళ్లడంతో చేనేతల కోసం నేతన్న నేస్తం పథకం ప్రవేశపెట్టి రూ.600 ఇచ్చే ముడిపట్టు రాయితీని ఏకంగా ఏడాదికి రూ.24 వేల చొప్పున ఒకే సారి నేతన్నల ఖాతాల్లో పడేలా చేశారన్నారు. ఎమ్మెల్యే చొరవతో అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి పథకం వర్తింపచేయడంతో చేనేత కార్మికులు వాటితో మగ్గాలను అభివృద్ధి చేసుకుంటూ మెరుగైన జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో చేనేతల మద్దతు కేతిరెడ్డికే ఉంటుందన్నారు. ప్రతి అర్హత గల చేనేత కార్మికునికి నేతన్న నేస్తం పథకం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చేనేత నాయకులు కాచర్ల అంజి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీసీఎంఆర్‌లో జాతీయ చేనేత దినోత్సవం

ధర్మవరం మండలం నాగలూరు వద్దనున్న రూపా రాజా పీసీఎంఆర్ పాఠశాలలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేనేత రంగంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రధానమైన చిహ్నాలలో చేనేత రంగం ఒకటన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రూపరాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు


మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఓడీ చెరువు మండల పరిధిలోని కొండకమర్ల గ్రామ సచివాలయం-1 పరిధిలోని కొండకమర్ల ఎస్సీ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ వర్గాల వారికి అమలు చేస్తున్న పథకాల గురించి తెలియజేశారు. పలువురు గ్రామస్తులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఎన్నో సంక్షేమ పథకాలను నేరుగా ఇంటికే చేరుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా ఉంటూ మీ బిడ్డ దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ రాజు నాయుడు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ష్యామీర్ భాషా, సింగిల్‌విండో అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, టెంపుల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ శ్రావణి, ఎంపీటీసీ నాగప్ప, కో ఆప్షన్ నిషార్ అహ్మద్, దుర్గాప్రసాద్ నాయక్, జావేద్, నయింభాషా, మారెన్న, ఎల్లేశ్వర, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులున్నారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య


మృతుడి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: అప్పుల బాధ తాళలేక రైతు చెన్నారెడ్డి (46) ఆత్మహత్య చేసుకున్న ఘటన ఒంటికొండలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రైతు చెన్నారెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన పొలంలో మూడు బోర్లు వేసినా అందులో నీరు పడలేదు. పంటల సాగుకు మరో రూ.5 లక్షల అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గంలేక సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఎంతసేపటికీ చెన్నారెడ్డి ఇంటి తలుపులు తెరవకపోవడంతో స్థానికులు కిటికీలో నుంచి చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, కుమారుడు మనోహర్ రెడ్డి, కూతురు మానస ఉన్నారు. చెన్నారెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం వారు మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ముదిగుబ్బ: ఏపీటీఎఫ్ మండల శాఖ కార్యవర్గ సమావేశం సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి సానే రవీంద్రరెడ్డి, పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోణంకి అశోక్‌కుమార్, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బీకే ముత్యాలప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రిమూర్తి హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా నాగేంద్ర, గౌరవాధ్యక్షుడిగా పీరు నాయక్, ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప, జిల్లా కౌన్సిలర్‌గా షబ్బీర్‌బాషా, ఉపాధ్యక్షులు నారాయణస్వామి, రంగనాయకులు, చిన్న సుంకన్న, అనురాధ, ఆదినారాయణ ఎన్నికయ్యారు. అలాగే, కార్యదర్శులుగా ఆంజినేయనాయక్, నరేష్, బాల, శివయ్య, చంద్రశేఖర్, గీతాదేవి, మదన్‌మోహన్‌యాదవ్, ఆడిటర్ మదన్‌మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భానుకోటలో ఘనంగా పెద్ద సరిగెత్తు

కనగానపల్లి: మండలంలోని భానుకోటలో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా సోమవారం పెద్ద సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. కొలువుదీరిన పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలంకరించి, పానకాలు, చెక్కర్ల చదివింపులు చేశారు. భక్తులు ఊరేగింపుగా వెళ్లి పీర్ల స్వాములను దర్శించుకున్నారు. మంగళవారం చివరి రోజు జలధి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. మొహర్రం వేడుకల సందర్భంగా భానుకోట గ్రామంలో సందడి నెలకొంది.

చేనేత రంగాన్ని ప్రోత్సహిద్దాం

బత్తలపల్లి: చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి శనివారం ఉద్యోగులు చేనేత వస్త్రాలను ధరించాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవి అన్నారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మండల స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు అధికారులందరూ ప్రతి శనివారం చేనేత వస్త్రాలను ధరించాలని సూచించారు. అంతకు ముందు స్పందన కార్యక్రమంలో 12 అర్జీలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌజన్యకుమారి, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజనీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఏఓ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఇతర అధికారులు హాజరయ్యారు.

ఆర్టీసీ బస్సు, బైకు ఢీ

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని పెడబల్లి జలాశయం సమీపంలో గల మూల మలుపు వద్ద సోమవారం ఆర్టీసీ బస్సును ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎఫ్ఈఎస్ స్వచ్ఛంద సంస్థలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న గణేష్.. ఆఫీస్‌లో మీటింగ్ నిమిత్తం మదనపల్లికి వెళుతుండగా బలిజపల్లి నుంచి తిరుగు ప్రయాణంలో వస్తున్న ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ క్రమంలో గణేష్‌కు రొమ్ము భాగంలో గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. వైద్య సేవల నిమిత్తం క్షతగాత్రుడిని 108 వాహనంలో తంబళ్లపల్లిలోని సీహెచ్‌సీకి తరలించారు.

ఎక్స్‌గ్రేషియా అందజేత

నల్లచెరువు: విద్యుదాఘాతంతో మరణించిన పంతుల చెరువు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అంజనప్పకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు విడుదలైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీఓ శకుంతల సోమవారం అంజనప్ప భార్య వెంకట రమణమ్మకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, సర్పంచ్ స్వర్ణలత, నాయకులు రమణారెడ్డి, లక్ష్మీపతి యాదవ్, ఏపీఓ మంజుల, ఈసీ బాలు నాయక్, టీఏలు ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో అన్నదానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం దాతల సహకారంతో రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. కలవల సుకన్య జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు కలవల నాగతేజ, మిహాన్‌తేజల సహకారంతో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కలవల మురళిధర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ నజీర్ చేతులమీదుగా రోగులకు అన్నదాన చేశారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు రిజిస్ట్రేషన్లు

తాడిమర్రి: ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రమాదేవి పేర్కొన్నారు. సోమవారం ఆమె స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో సకాలంలో పదునైన వర్షం కురవలేదన్నారు. వేరుశనగ సాగుచేయని వారికి ప్రత్యామ్నాయ పంటలైన పెసర, అలసంద, ఉలవ సాగు చేయదలచుకున్న రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో విత్తనాలను పంపిణీ చేస్తుందని తెలియజేశారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

పుట్టపర్తి టౌన్: స్థల వివాదంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఇద్దరికీ రక్త గాయాలయ్యాయి. ఎస్‌ఐ గోపి తెలిపిన మేరకు.. ఓడీ చెరువు మండలం బాలప్పగారిపల్లిలో మాసే నరసింహులు, చంద్రాయుడు మధ్య స్థలం విషయంలో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం కూడా ఘర్షణ చోటుచేసుకుంది. రాళ్లు, కట్టెలతో దాడి చేసుకున్నారు. దీంతో తీవ్ర గాయాలైన ఇద్దరినీ స్థానికులు కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాజా కూరగాయలు ఉపయోగించాలి

నల్లమాడ: వంటలకు తాజా కూరగాయలు ఉపయోగించాలని ఎంపీపీ డుంగావత్ సునీతా బాయి తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలను సోమవారం ఎంపీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులకు పంపిణీ చేసే కోడిగుడ్లు, కూరగాయలు నాసిరకంగా ఉండటంపై హాస్టల్ సంక్షేమ అధికారిపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి ఎలా అనుమతిస్తున్నారంటూ ప్రశ్నించారు. తాజా కూరగాయలతో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. అలాగే పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరవుతున్నారా, పాఠాలు బాగా చెబుతున్నారా అంటూ ఎంపీపీ విద్యార్థులతో ఆరా తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అంజినాయక్ తదితరులున్నారు.

13న ఉచిత కంటి వైద్య శిబిరం


పోస్టర్లు విడుదల చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 13న నిర్వహించనున్న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శనగుప్త, క్యాంపు చైర్మన్ నరేంద్రరెడ్డిలు తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో సోమవారం వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యుల సమక్షంలో కంటిచూపు తగ్గిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయించనున్నామని తెలిపారు. కంటిచూపు తగ్గిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ల వెంకటేషులు, హరినాథ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్ర ధనస్సు ప్రారంభం


జగరాజుపల్లిలో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ నాగరాజునాయక్, జ్యోత్స్న పేర్కొన్నారు. సోమవారం జగరాజుపల్లి గ్రామంలో సర్పంచ్ లక్ష్మీనరసమ్మ సమక్షంలో చిన్నారులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ గర్భిణులు, 5 ఏళ్ల లోపు చిన్నారులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయించుకోవాలన్నారు. ఆగస్టు 7 నుంచి 12 వ తేదీ వరకూ సెప్టెంబర్ 11 నుంచి 16 వరకూ, అక్టోబర్ 9 నుంచి 14 వరకూ కార్యక్రమం సాగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, సిబ్బంది ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ముదిగుబ్బ: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రాజేంద్ర చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం ఆయన చిన్నారులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడలో...

నల్లమాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని మండలంలో సోమవారం ప్రారంభించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఘనేనాయక్ తెలిపారు. తొలిరోజు రెడ్డిపల్లి, దొన్నికోట గ్రామాల్లో డ్రాపౌట్ పిల్లలకు ఆరోగ్య సిబ్బంది టీకాలు వేశారు. ఈ కార్యక్రమం ఈనెల 12 వరకు కొనసాగుతుందని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో దొన్నికోట సర్పంచ్ రాగినేని సరస్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజునాయుడు, సీహెచ్‌ఓ రామాంజులు, తదితరులు పాల్గొన్నారు.

తలుపులలో..

తలుపుల: స్థానిక ప్రాథమిక వైద్యశాలలో వైద్యాధికారులు మున్వర్‌బాషా, సల్మా, వైద్యాధికారి వెంకట్రాముడు సోమవారం మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమం ప్రారంభించారు. మండలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని వారిని గుర్తించి, సచివాలయాల వారీగా 7 నుంచి 12 వరకు ఆయా గ్రామాలలో టీకాలు వేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

బత్తలపల్లి: మండలంలోని కట్టకిందపల్లికి చెందిన సావిత్రమ్మ రోడ్డు ప్రమాదానికి గురై ఆపరేషన్ చేయించుకున్నారు. అందుకు ఆమెకు అయిన ఖర్చును సీఎం సహాయనిధి కింద ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి దరఖాస్తు చేసుకున్నారు. స్పందించిన ఆయన సీఎం కార్యాలయం నుంచి రూ.3.50లక్షలు మంజూరు చేయించారు. సోమవారం ఆ చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆమె కుమారుడికి ధర్మవరం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని కూడా ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆదుకుంటున్నారన్నారు. చెక్కును అందుకున్న బాధితులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లి పాలు శిశువుకు శ్రీరామరక్ష


తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న దృశ్యం

తనకల్లు: తల్లి పాలే శిశువుకు శ్రీరామ రక్ష అని ఎంపీపీ వైవీ కౌసల్య, సర్పంచ్ సరస్వతి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, ఏడేళ్లలోపు చిన్నారులు మంచి పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. పోషక ఆహారాన్ని అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ చేపట్టారు. అలాగే టీ సదుం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయమ్మ, ఆరోగ్య సిబ్బంది నాగమల్లిక, ధనలక్ష్మి, సావిత్రమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్ మృతి తీరని లోటు


గద్దర్‌కు నివాళులర్పిస్తున్న ట్రస్ట్ సభ్యులు

పుట్టపర్తి అర్బన్: ప్రజాకవి గద్దర్ మృతి బడుగుబలహీన వర్గాలకు తీరని లోటని లోచర్ల పెద్దారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ లోచర్ల విజయ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి సమీపంలోని లోచర్ల పెద్దారెడ్డి కాలనీలో గద్దర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో అప్పట్లో ఏర్పాటు చేసిన సభలకు వెళ్లే వాడినని, ఆయన పాటలతోనే తాము ప్రజాఉద్యమంలోకి వెళ్లామన్నారు. ప్రజల కోసమే తన జీవితాన్ని ధారపోశారన్నారు. ఆయన పాటలతోనే యువతలో స్ఫూర్తినింపారన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల గుండెల్లో ఎన్నటికీ జీవించి ఉంటారన్నారు. కార్యక్రమంలో సిద్ద రాంపురం కేశప్ప, బుగ్గపల్లి రామమోహన్, రంగనాయకులు, అమగొండపాళ్యం శ్రీనివాసులు, లోచర్ల సూరి, వెంకటరాముడు, రామయ్య, ఓడీసీ గోపాల్, రామాంజి, సన్నాయప్ప, క్రిష్టారెడ్డి తదితరులున్నారు.

ప్రత్యేక అధికారుల నియామకం

బత్తలపల్లి: 'ఆజాదీ కా అమృత్ మహోత్సవం'లో భాగంగా నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహణకు ప్రతి గ్రామ పంచాయతీకి మండలస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు ఎంపీడీఓ సౌజన్యకుమారి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ భూములు, అనువైన ప్రదేశాలలో మొక్కలు నాటించే కార్యక్రమం స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో చేపట్టాలని సూచించారు. షెడ్యూల్ విడుదల చేశారు. 9వ తేదీ బత్తలపల్లి, ఓబుళాపురం, డి.చెర్లోపల్లి, దంపెట్ల, 10వ తేదీ నల్లబోయనపల్లి, ఈదుల ముష్టూరు, సంజీవపురం, 11న సంగాల, అప్పరాచెరువు, మాల్యవంతం, 14న గరిశలపల్లి, తంబాపురం, పోట్లమర్రి గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలను భాగస్వాములను చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీసీల అభ్యున్నతికి పాటుపడాలి

కదిరి టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సోమవారం బీసీ మహాజన సమితి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాయలసీమ కో ఆర్డినేటర్ కె.ఆర్.ప్రసాద్ హాజరై మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.ఆర్.హరిప్రసాద్, ఇర్ఫాన్,అంజనేయులు,శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు గీతాలాపన

కదిరి టౌన్: వాసవి ఆర్యవైశ్య వసతి మందిరంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు 'నవ్వుల సమయం' కదిరి వారి ప్రథమ వార్షికోత్సవం సంబరాలు నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. అనంతపురం నుంచి విచ్చేసిన ఔత్సాహిక కళాకారులతో పలు చిత్రాలలోని గీతాల ఆలాపన ఉంటుందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రీడాకారిణులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దృఢత్వానికి దోహదపడతాయని ఆర్డీటీ స్పోర్ట్స్ సెక్టార్ డైరెక్టర్ సాయికృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో బాలికల గ్రామీణ అథ్లెటిక్స్ మీట్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్డీటీ స్పోర్ట్స్ సెక్టార్ డైరెక్టర్ సాయికృష్ణ, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ జ్యోతి, రీజనల్ డైరెక్టర్ ప్రమీల హాజరయ్యారు. వారు మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడలు చాలా అవసరమన్నారు. అనూష జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపిక అయిందంటే అందుకు కారణం ఆర్డీటీ సంస్థయేనన్నారు. అనంతరం 100 మీటర్లు, 200, 400 మీటర్ల పరుగు, 400 మీటర్ల రిలే, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ ఈవెంట్స్ నిర్వహించారు. బత్తలపల్లి ఏరియాలో లాంగ్ జంప్‌కి కుసుమ (జెడ్పీ హైస్కూల్, తాడిమర్రి), 400 మీటర్లు సౌమ్య(జెడ్పీ హైస్కూల్, కె.రామాపురం), 200 మీటర్లు జాస్మిత్ (జెడ్పీ హైస్కూల్, బత్తలపల్లి), 400 మీటర్ల రిలే అనూష, హేమ, జయంతి, జాహ్నవి, షాట్‌పుట్‌లో సిమ్లీ 100 మీటర్‌లో శిల్ప ప్రథమ స్థానంలో నిలిచారు. అదేవిధంగా ముదిగుబ్బ ఏరియా నుంచి కుసుమ 100 మీటర్లు, విగ్నేశ్వరి 200 మీటర్లు, శ్రీలేఖ 400 మీటర్లు, శ్రీలేఖ లాంగ్ జంప్, అహల్య షార్ట్‌పుట్, 400 మీటర్ల రిలే శిరీష, స్రవంతి, ఇందుప్రియ, స్వాతి ప్రథమ స్థానంలో నిలిచారు. వారికి మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏటీఎల్‌లు రుక్మాంగద, సంజీవ రెడ్డి, సీఓలు, విద్యార్థినులు పాల్గొన్నారు.